క్లుప్తంగా

నేడు 'మీతో నేను'

మోమిన్‌పేట: మోమిన్‌పేట గ్రామంలో బుధవారం ఉదయం 6.30గంటలకు జరగనున్న మీతో నేను కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ పాల్గొననున్నట్లు బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు వెంకట్ తెలిపారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువస్తే.. అక్కడికక్కడే సమస్యలు పరిష్కరిస్తారని చెప్పారు. మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు సకాలంలో హాజరుకావాలని ఆయన కోరారు.

నాగవర్ధన్‌కు 'లెజెండ్' అవార్డు



అవార్డు అందుకుంటున్న నాగవర్ధన్

పరిగి: 'క్రాంతిజ్యోతి' మహిళా సాధికారత స్వచ్ఛంద సేవా సంస్థ లెజెండ్ అవార్డును మండల పరిధిలోని రాపోల్ గ్రామానికి చెందిన నాగవర్ధన్ అందుకున్నారు. సమాజసేవకుడిగా.. యువతలో చైతన్యం తెస్తూ సమాజాభివృద్ధికి పాటు పడుతున్న వారిని గుర్తించిన ఆ సంస్థ.. జిల్లా నుంచి నాగవర్ధన్‌ను ఎంపిక చేసింది. అనంతరం వరంగల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో సంస్థ చైర్మన్ రజినీరుద్రమ సేవకుడికి అవార్డు ప్రదానం చేశారు.

భక్తుల చెంతకు రాములోరి తలంబ్రాలు

కుల్కచర్ల: భద్రాచలం సీతారాముల కల్యాణం తలంబ్రాలు పొందేందుకు భక్తులు రూ.120 డీడీలు చెల్లిస్తున్నారని డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి అన్నారు. ఈ మేరకు ఆయన మంగళవారం మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజల మనోభావాలను గుర్తిస్తూ.. రాములోరి తలంబ్రాలు భక్తులకు పంపిణీ చేసేందుకు ఆర్టీసీ చేస్తున్న ప్రయత్నం ప్రజలకు ఎంతగానో ఉపయోగంగా ఉందని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ఆంజనేయులు, బ్లాకటు అధ్యక్షుడు ఆంజనేయులు, ఆర్టీసీ కండక్టర్ చంద్రయ్య, నాయకులు ప్రకాశ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి కల్యాణం



ఆలయంలో కొలువుదీరిన దేవతామూర్తులు

తాండూరు రూరల్: మండల పరిధిలోని చెంగోల్ గ్రామంలో శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి కల్యాణం వైభవంగా జరిగింది. మంగళవారం దేవాలయ చైర్మన్ కృష్ణయ్య ఆధ్వర్యంలో ఉత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో స్వామి వివేకానంద యువజన సంఘం అధ్యక్షుడు రాము పాల్గొన్నారు.

కరోనా బాధితులు అప్రమత్తంగా ఉండాలి



బాధితురాలికి సూచనలు చేస్తున్న హెల్త్ ఆఫీసర్ చంద్రప్రకాశ్

కుల్కచర్ల: కరోనా వ్యాధి పట్ల ప్రజలు భయాందోళనకు గురికావొద్దని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ చంద్రప్రకాశ్ చెప్పారు. మంగళవారం కుల్కచర్ల మండల కేంద్రంలో వైరస్ బాధితుల ఇంటికి వెళ్లి తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. వ్యాధికి భయపడాల్సిన అవసరం లేకున్నా.. నిర్లక్ష్యం చేస్తే ఇబ్బందికర పరిస్థితులు ఎదుర్కోవాల్సి వస్తుందని చెప్పారు. కరోనా సోకితే తప్పనిసరిగా క్వారంటైన్‌లో ఉండాలని, బయట తిరగవద్దని సూచించారు. కాగా మంగళవారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో 35మందికి కోవిడ్ పరీక్షలు నిర్వహించగా.. ముగ్గురికి పాజిటివ్‌గా నిర్ధారణ అయిందని వైద్యాధికారులు పేర్కొన్నారు.

మోమిన్‌పేట సంత వేలం

మోమిన్‌పేట: మోమిన్‌పేట తైబజార్ రూ.2.45 లక్షలకు పలికింది. బాలయ్య అనే వ్యక్తి తైబజార్‌ను దక్కించుకున్నారు. మంగళవారం ఉదయం 11గంటలకు సర్పంచ్ అంగేరి శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన పంచాయతీ కార్యాలయంలో బహిరంగ వేలం పాట నిర్వహించారు. ఏప్రిల్ 01, 2023 నుంచి మార్చి 31, 2024 వరకు ఇది వర్తిస్తుంది. తైబజార్ దక్కించుకొన్న బాలయ్య తక్షణమే 50శాతం డబ్బులు చెల్లించాలని, లేదంటే రూ.2.41 లక్షలకు పాడిన నర్సింహులుకు తైబజార్ దక్కుతుందని కార్యదర్శి నర్సింహులు తెలిపారు. ప్రతి శనివారం జరిగే వారంతపు సంత కూరగాయల దుకాణం, వాహనాలకు సంబంధించి రూ.20 వసూలు చేసుకోవాలని సూచించారు. అధికంగా వసూలు చేస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ నరేష్, వార్డు సభ్యులు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అలంకారప్రాయమే..

సాగులో సమస్యలు వస్తే రైతులు వ్యవసాయ అధికారులను కలవాలంటే ఒకప్పుడు మండల, జిల్లా కేంద్రానికో వెళ్లాల్సి వచ్చేది. దీంతో సమయభావంతో పాటు ఆర్థికభారం అన్నదాతలపై పడేది. అదంతా వృథా ప్రయాసం అని గమనించిన రాష్ట్ర ప్రభుత్వం.. కర్షకుల చెంతకే సాగులో సమస్యల పరిష్కార వేదికలంటూ అందుబాటులోకి తెచ్చింది. కానీ.. నిర్వహణ లోపంతో రైతు వేదికలు నిరుపయోగంగా మారాయి.

- అక్కరకురాని రైతువేదికలు
- అధికారుల సమన్వయలోపం
- అన్నదాతలకు అందని సమాచారం
- నిధులున్నా నిర్వహణ శూన్యం
- మౌలిక సదుపాయాల కల్పనలో నిర్లక్ష్యం



దౌల్తాబాద్‌లో నిరుపయోగంగా ఉన్న రైతువేదిక

దౌల్తాబాద్: అన్నదాతలకు సేవలందించడం కోసం నిర్మించిన రైతువేదికలు అస్తవ్యస్తంగా మారాయి. వేదికల నిర్వహణను ఆ శాఖ అధికారులు గాలికి వదిలేయడంతో అవి నిరుపయోగంగా మారాయి. మండలంలో 33 గ్రామపంచాయతీలు ఉండగా.. 8 క్లస్టర్లలో ప్రభుత్వం రైతు వేదికలు నిర్మించింది. బాలంపేట, గోకఫసల్‌వాద్, దేవర్‌ఫసల్‌వాద్, దౌల్తాబాద్, కుదురుమళ్ల, చల్లాపూర్, నందారం, బిచ్చాల గ్రామాల్లో వేదికలు నిర్మించారు. ప్రతి క్లస్టర్ పరిధిలో నాలుగు నుంచి 5 గ్రామాలు వస్తాయి. అయితే కేవలం చల్లాపూర్, కుదురుమళ్ల, నందారం వేదికల్లో మినహా.. మిగతా 5 రైతువేదిక భవనాలు అసంపూర్తిగా మిగిలాయి. బిచ్చాల, దౌల్తాబాద్ రైతువేదికలో టాయిలెట్స్ వినియోగించుకోవడానికి నీటి సౌకర్యం లేదు. మిగిలిన వాటిల్లో అసలు మూత్రశాలలు లేక ఇబ్బందులు పడుతున్నారు.

కానరాని సమీక్షలు

ఏటా ఖరీఫ్(వానాకాలం), రబీ(యాసంగి) సీజన్‌లో రైతులు సాగు చేసే విధానాలు, మేలైన విత్తనాలు, సస్యరక్షణ చర్యలు, సాగు విధానాల గురించి రైతులకు అవగాహన కల్పించడం కోసం ఏర్పాటు చేసిన ఈ రైతు వేదికలు ఆచరణలో అమలు కావడంలేదు. అసలు సమావేశాలు ఎప్పుడు జరుగుతున్నాయో రైతులకు తెలియడంలేదు. నెలనెలా ఈ వేదికల్లో రైతులతో సంబంధిత అధికారులు సమావేశం ఏర్పాటు చేయాలి. కానీ అధికారులు రైతులకు తగిన సమాచారం ఇవ్వడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సాగు చేసిన పంటలపై అనుమానాలను నివృత్తి చేసుకునేందుకు ఈ వేదికల్లో సంబంధిత ఏఈఓలు అందుబాటులో ఉన్నప్పటికీ.. వేదికల వద్ద రైతులు కానరావడంలేదు.

నిధులున్నా.. నిర్వహణలోపం

ప్రతి రైతువేదిక నిర్వహణ కోసం నెలనెలా రూ.9వేలు ప్రభుత్వం కేటాయిస్తోంది. ఈ నిధులు ఏఈఓల ఖాతాల్లో నాలుగైదు నెలలకోసారి జమ చేస్తోంది. ఈ డబ్బును రైతు వేదికల్లో జరిగే సమావేశాలకు వచ్చే రైతులకు టీ, బిస్కట్లతో పాటు ఇతర అవసరాలకు వినియోగిస్తారు. అయితే నిధులున్నా.. వాటిని ఖర్చు చేసేందుకు నిర్వాహకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలున్నాయి. ఓ వైపు సమాచారం లేక పోవడం.. మరో వైపు మూత్రశాలలు, తదితర సౌకర్యాలు లేక రైతు వేదికలకు కర్షకులు రావడం లేదని, ముఖ్యంగా మహిళా రైతులు రావడానికి ఆసక్తి చూపకపోవడంతో.. ఆ వేదికలు నిరుపయోగంగా మారుతున్నాయి.

అధికారుల దృష్టికి తీసుకెళ్లాం

మండలంలోని రైతువేదికల పనులు కొంతమేర అసంపూర్తిగా ఉన్నాయి. ఈ విషయమై ఉన్నతాధికారులకు వివరించాం. పూర్తయిన వేదికల్లో ఏఈఓలు సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఆశించిన స్థాయిలో మీటింగులకు రైతులు ముందుకు రావడంలేదు. వారికి అన్ని విధాలుగా సలహాలు, సూచనలు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నాం.

–లావణ్య, ఏఓ, దౌల్తాబాద్

ఉల్లిగడ్డ స్టోరేజీకి ప్రతిపాదనలు

- రైతుల అభ్యున్నతికి సొసైటీ కృషి
- ఎల్మకన్నె పీఏసీఎస్ చైర్మన్ రవిగౌడ్



సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ రవిగౌడ్

తాండూరు రూరల్: ఉల్లిగడ్డ నిల్వ చేసుకునేందుకు మండల పరిధి అల్లాపూర్ గ్రామ శివారులోని ప్రభుత్వ భూమిలో శీతల గిడ్డంగి నిర్మించాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించనున్నట్లు ఎల్మకన్నె పీఏసీఎస్ చైర్మన్ సంగెం రవిగౌడ్ చెప్పారు. మంగళవారం పట్టణంలోని పీఏసీఎస్ కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో చైర్మన్ మాట్లాడారు. ఎల్మకన్నె సహకార సంఘం రైతుల అభ్యున్నతికి కృషి చేస్తోందని చెప్పారు. ఇప్పటి వరకు సొసైటీ నుంచి రూ.5 కోట్లతో రైతులకు స్వల్పకాలిక, రూ.2 కోట్లతో దీర్ఘకాలిక రుణాలు ఇచ్చామని, అదేవిధంగా రూ.13 కోట్ల రుణాలు బంగారంపై అందజేసినట్లు తెలిపారు. సొసైటీకి రైతులు సహకరించాలని, డీసీసీబీ చైర్మన్ మనోహర్‌రెడ్డి సహకారంతో సంస్థను మరింత అభివృద్ధి చేస్తామని వెల్లడించారు. అల్లాపూర్ శివారు ప్రభుత్వ భూమిలో నాబార్డు నిధులతో గోదాంలు నిర్మిస్తున్నామని, ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తే.. అక్కడే ఉల్లిగడ్డ నిల్వ ఉంచేందుకు కోల్డ్ స్టోరేజీ నిర్మిస్తామని చెప్పారు. వచ్చే వానాకాలం సీజన్‌లో రైతులకు ఉపయోగపడే డీఏపీ, యూరియా కూడా సొసైటీలో అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీనియర్ ఇన్‌స్పెక్టర్ అజ్మత్‌పాషా, వైస్ చైర్మన్ ప్రశాంత్‌రెడ్డి, సీఈఓ శ్రీనివాస్, డైరెక్టర్లు, రైతులు, సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.

ఫోరం లేక సమావేశం వాయిదా

పెద్దేముల్: పెద్దేముల్ మండల తట్టెపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సమావేశం ఫోరం లేక మంగళవారం వాయిదా వేశామని చైర్మన్ లక్ష్మారెడ్డి, వైస్ చైర్మన్ అంజప్ప, సీఈఓ రాజమౌళి తెలిపారు. సంఘంలో సభ్యుల సంఖ్య 2100 మంది ఉండగా.. అందులో 10శాతం 210 మంది సభ్యులు రావలసి ఉంది. కానీ.. 115 మంది సభ్యులు మాత్రమే రావడంతో పూర్తి స్థాయిలో ఫోరం లేక సర్వసభ్య సమావేశం వాయిదా వేసినట్లు చెప్పారు. మరలా సమీక్ష నిర్వహించే తేదీని త్వరలో ప్రకటిస్తామని, అయితే ఆ మీటింగుకు సరిపోను సభ్యులు లేకున్నా.. సమావేశం నిర్వహిస్తామని చైర్మన్ వెల్లడించారు.

పది రోజుల్లో గోదాం పనులు పూర్తి

తట్టెపల్లి ప్రాథమిక సహకార సంఘంలో రూ.80లక్షల నాబార్డు నిధులతో నిర్మిస్తున్న ఎరువుల గోదాం నిర్మాణ పనులు పది రోజుల్లో పూర్తవుతాయని చైర్మన్ లక్ష్మారెడ్డి తెలిపారు. పనులు పూర్తి అయిన వెంటనే ఈ ప్రాంత రైతులకు ఎలాంటి ఎరువుల సమస్య లేకుండా చుస్తామని వెల్లడించారు. ఇందుకు సంఘం సభ్యులు కూడా సహకరించాలని కోరారు.



గోదాం నిర్మాణ పనులు పరిశీలిస్తున్న చైర్మన్ లక్ష్మారెడ్డి

శివాజీ స్ఫూర్తితో ముందుకు సాగాలి

డీసీసీబీ చైర్మన్ మనోహర్‌రెడ్డి

దోమ: ఛత్రపతి శివాజీ మహరాజ్‌ను యువత స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాలని డీసీసీబీ చైర్మన్ బుయ్యని మనోహర్‌రెడ్డి సూచించారు. బొంపల్లిలో ప్రతిష్ఠించనున్న శివాజీ విగ్రహానికి మంగళవారం రూ.50 వేల విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హైందవ జాగృతికి, హిందూ సంరక్షణకు శివాజీ ఎంతో కృషి చేశారని, దేశం కోసం అనేక పోరాటాలు చేసి హిందూ సామ్రాట్‌గా పేరు తెచ్చుకున్నారని ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సర్పంచ్ కోళ్ల సురేశ్, ఎంపీటీసీ రాములు, రిటైర్డ్ ఎస్‌ఐ అంతిరెడ్డి, గ్రామస్తులు ముద్దం పవన్ యాదవ్, లోకేశ్ యాదవ్, ప్రవీణ్ యాదవ్, గుడిసె రాములు, బాబు, పెంటయ్య, నర్సింహ యాదవ్, రమేశ్, కుర్వ రమేశ్, శ్రీనివాస్, నర్సింహులు, ఉవగుంట యాదయ్య, చంద్రకంటి శ్రీనివాస్, సురేశ్ రెడ్డి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



దోమ: విరాళం అందజేస్తున్న డీసీసీబీ చైర్మన్ మనోహర్ రెడ్డి

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత

కుల్కచర్ల: ప్రతి ఒక్కరూ భక్తిభావాన్ని పెంపొందించుకోవాలని డీసీసీబీ చైర్మన్ బుయ్యని మనోహర్ రెడ్డి అన్నారు. చౌడాపూర్ మండలం బంగ్రంపల్లిలో తిరుమలనాథ స్వామి ఉత్సవాల్లో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత నెలకొంటుందని, ఆలయాల అభ్యున్నతికి తాము వ్యక్తిగతంగా తోడ్పడతామని చెప్పారు.

ఈ నేలలు.. దుంపల సాగుకు అనుకూలం

ఉద్యాన విశ్వవిద్యాలయ శాస్త్రవేత్త లక్ష్మణ్

వికారాబాద్ అర్బన్: చామగడ్డ, మొరంగడ్డ పంటలకు వికారాబాద్ చుట్టూ ఉన్న భూములు ఎంతో అనువైనవని కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయ శాస్త్రవేత్త డాక్టర్ సురేష్ తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని ఎర్రవల్లి గ్రామం రైతులకు ఉద్యాన విశ్వవిద్యాలయం, పట్టు పరిశ్రమల శాఖ, ఎస్సీ సబ్‌ప్లాన్, కింద మహిళా సాధికారతకై ప్రోత్సాహిక చామదుంప, మొరంగడ్డ సాగుకై మహిళా రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లాభదాయక పంటలు పండించేందుకు రైతులు ముందుకు రావాలని, ప్రభుత్వం ఇస్తున్న రాయితీలను, పథకాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. పంట వేయడంలో తీయడంలో శాస్త్రవేతలు, ఉద్యానవన శాఖ అధికారుల సలహాలు, సూచనలు తీసుకోవడంతో పాటు, సాంకేతిక పద్ధతిలో సాగుచేయాలని చెప్పారు. అనంతరం శాస్త్ర వేత్తలు రూపొందిన కొత్త రకం మొరంగడ్డ విత్తనాలను మహిళలకు పంపిణీ చేశారు.



పంటలపై అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త

ప్రైవేటుకు దీటుగా సర్కారు బడుల్లో బోధన

ఉన్నత స్థానమే లక్ష్యంగా విద్యార్థులు శ్రమించాలి: బీసీ నేతలు

తాండూరు టౌన్: విద్యార్థులు ఉన్నత స్థానమే లక్ష్యంగా శ్రమించాలని బీసీ సంఘం యువ నాయకులు అన్నారు. మంగళవారం స్థానిక విజయ విద్యాలయ, కందనెల్లిలోని జెడ్పీ హైస్కూల్ పదో తరగతి విద్యార్థులకు ఆ సంఘం జాతీయ కార్యవర్గ సభ్యుడు రాజ్‌కుమార్ సహకారంతో పరీక్ష ప్యాడ్లు, పెన్నులు అందజేసి మాట్లాడారు. ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో బోధన జరుగుతోందని, ఆ విద్యార్థులు ఎంతో ఉన్నత స్థానంలో ఉద్యోగాలు చేస్తున్నారని వెల్లడించారు. పరీక్షలు బాగా రాసి, ఉత్తీర్ణులు కావాలన్నారు. అలాగే ఉన్నత చదువులు చదివి భవిష్యత్‌లో పేరు ప్రఖ్యాతులు సాధించాలని సూచించారు. బీసీ సంఘం రాష్ట్ర నాయకుడు సయ్యద్ షకూర్, మహిళా సంఘం అధ్యక్షురాలు మధులత, సోషల్ మీడియా ఇన్‌చార్జి బస్వరాజ్, యువ నాయకులు రాము, జగన్, వెంకట్, శివ, పరమేష్, సాయి, నర్సింహ్మ పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి కృషి..

పూడూరు: రాష్ట్ర ప్రభుత్వం విద్యాభివృద్ధికి కృషి చేస్తోందని ఎంపీపీ మల్లేషం అన్నారు. మండల పరిధిలోని ఎన్కేపల్లి మోడల్ స్కూల్ విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లు, పెన్నులు అందజేసి మాట్లాడారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదివి మంచి మార్కులు సాధించాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మేఘమాల, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ అజహరుద్దీన్, నాయకులు వేణుగోపాల్, పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీదేవి, సిబ్బంది పాల్గొన్నారు.

అందరి సహకారంతో ఆలయం అభివృద్ధి

కుల్కచర్ల: అందరి సహకారంతో పాంబండ ఆలయ అభివృద్ధికి నిర్విరామంగా కృషి చేస్తున్నామని పాంబండ రామలింగేశ్వర దేవస్థానం చైర్మన్ రాములు, ఈఓ సుధాకర్ తెలిపారు. మంగళవారం కుల్కచర్ల మండలం బండవెల్కిచర్ల గ్రామ పరిధిలోని పాంబండ రామలిగేశ్వర ఆలయంలో ఇటీవల జరిగిన బ్రహ్మోత్సవాల్లో భాగంగా భక్తులు స్వామివారికి సమర్పించిన లేగదూడలు తొమ్మిదింటిని మంగళవారం వేలం వేశారు. ఈ వేలంలో బండవెల్కిచర్ల గ్రామానికి చెందిన భీమయ్య అనే వ్యక్తి రూ.38వేలకు ఆ దూడలను సొంతం చేసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆలయ అభివృద్ధికి సమష్టి సహకారంతో ముందుకు సాగుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు లక్ష్మయ్య, సంజీవ్, హన్మంత్, కృష్ణయ్య, ఆలయ అర్చకులు దశరథం, పాండు, అనంతమయ్య తదితరులు పాల్గొన్నారు.



లేగ దూడలకు వేలం పాట నిర్వహిస్తున్న ఆలయ అధికారులు

అధికారంలో లేకున్నా.. అభివృద్ధి చేస్తాం

- ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి
- డీసీసీ అధ్యక్షుడు టి. రామ్మోహన్‌రెడ్డి

పరిగి: అధికారంలో ఉన్నా లేకపోయినా గ్రామాల అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని డీసీసీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. మండల పరిధి కళ్లాపూర్‌లోని లొంక హనుమాన్ దేవాలయానికి వెళ్లే రోడ్డు మార్గం సరిగా లేకపోవడంతో.. వైఎస్‌ఆర్‌సీపీ రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య నిధులు రూ.10 లక్షలతో చేపట్టిన సీసీరోడ్డు పనులను బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ లాల్‌కృష్ణ ఆధ్వర్యంలో మంగళవారం డీసీసీ అధ్యక్షుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్ కృష్ణయ్య గ్రామాభివృద్ధికి నిధులు కేటాయించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి, ప్రజా సమస్యలను తెలుసుకొని వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తామని చెప్పారు. ప్రసిద్ధి చెందిన పుణ్యక్షేత్రానికి కనీస రోడ్డు సౌకర్యం లేకపోవడంతో సీసీ ఏర్పాటుకు తమ వంతు కృషి చేస్తున్నామని తెలిపారు. జాఫర్‌పల్లి నుంచి దేవాలయం వరకు రోడ్డు సక్రమంగా లేదని, కావున అధికార పార్టీ ప్రజాప్రతినిధులు దేవాలయం వరకు బీటీ రోడ్డును ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి హన్మంత్ ముదిరాజ్, సర్పంచ్‌లు జంగయ్య, అనిత, మండల అధ్యక్షుడు పరశురాంరెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఎర్రగడ్డపల్లి కృష్ణ, ఫ్లోర్‌లీడర్ శ్రీనివాస్, చిన్న నర్సింహులు పాల్గొన్నారు.



సీసీరోడ్డు పనులు ప్రారంభిస్తున్న రామ్మోహన్‌రెడ్డి

తైబజార్‌కు రూ.2.20 లక్షలు

బంట్వారం: మండల కేంద్రం కోట్‌పల్లి తైబజార్ బహిరంగ వేలం మంగళవారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహించారు. వేలం పాటలో నలుగురు పోటీ పడగా కోట్‌పల్లికి చెందిన వాహిద్ మియా రూ.2.20 లక్షలకు దక్కించుకున్నారు. గత ఏడాదితో పోలిస్తే ఈ సంవత్సరం రూ.55 వేలు ఎక్కువగా పలికింది. కూరగాయల మార్కెట్‌కు సంబంధించి ప్రతి సోమవారం జరిగే సంతలో నిర్ణీత రుసుంతో డబ్బులు వసూలు చేయాల్సి ఉంటుంది. సర్పంచ్ విజయలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి, మత్స్య సహకార సంఘం మాజీ అధ్యక్షుడు బందెయ్య, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

వీధి నాటకాలను ప్రోత్సహించాలి

దోమ: ప్రాచీన కాలంనాటి వీధి నాటకాలను ప్రోత్సహించాలని కేఎస్‌ఆర్ ట్రస్ట్ చైర్మన్ శరత్ కుమార్ రెడ్డి అన్నారు. మంగళవారం దోమ మండల కేంద్రంతో పాటు బట్ల చందారంలో వీధి నాటక ప్రదర్శన ఇస్తున్న కళాకారులకు ఆయన నివాసంలో రూ.35 వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రాచీన కాలం నాటి వీధి నాటకాలను గ్రామాల్లో ప్రదర్శించి, ప్రజలకు అర్థవంతంగా వివరించడం గర్వించదగ్గ విషయమన్నారు. ట్రస్ట్ సభ్యులు ఐనాపూర్ నర్సింహులు, అజయ్ కుమార్ రెడ్డి, పలు గ్రామాల ప్రజలు నారాయణ, సూరయ్యగౌడ్, గోవర్ధన్, దస్తయ్య, అనంతయ్య, శ్రీనివాస్, కృష్ణ, మహేశ్, కావలి ఆశన్న, నరేశ్ పాల్గొన్నారు.

'కంటివెలుగు'తో దృష్టిలోపాన్ని జయించండి

కొడంగల్ రూరల్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటివెలుగు కార్యక్రమాన్ని వినియోగించుకొని, దృష్టిలోపాన్ని జయించండి అని పర్సాపూర్ సర్పంచ్ సయ్యద్ అంజద్ చెప్పారు. మంగళవారం గ్రామంలోని రైతువేదిక భవనంలో ఏర్పాటు చేసిన కంటివెలుగు శిబిరాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. వైద్యులు కంటి పరీక్ష అనంతరం ఉచితంగా మందులు, కళ్లద్దాలు ఇస్తున్నారని, అవసరమైన వారికి ఎలాంటి ఖర్చులేకుండా కంటి ఆపరేషన్ చేయిస్తారని తెలిపారు.

ఉచిత వైద్యసేవలు వినియోగించుకోండి

పరిగి: ఉచిత వైద్యసేవలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ అరవింద్‌రావు సూచించారు. మండల పరిధిలోని రంగాపూర్ గ్రామంలో మంగళవారం సత్యసాయి సేవాసమితీ ఆధ్వర్యంలో మహవీర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసి వైద్య శిబిరంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి నిరుపేదలకు ఉచితంగా వైద్యం అందించడం ద్వారా ఎంతో మందికి మేలు జరుగుతుందన్నారు.

ప్రశాంతంగా పరీక్ష రాయాలి

అనంతగిరి: పదో తరగతి విద్యార్థులు ప్రశాంతమైన వాతావరణంలో పరీక్షలు రాయాలని వికారాబాద్ టౌన్ సీఐ శీను సూచించారు. మంగళవారం వికారాబాద్‌లోని జెడ్పీహెచ్‌ఎస్ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పరీక్షలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ధైర్యంగా పరీక్షలు రాయాలన్నారు. గంట ముందే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని చెప్పారు. తొందర పడకుండా.. ప్రశ్నపత్రం ఇచ్చిన వెంటనే.. ముందుగా మొత్తం చదవాలని, అందులో మీకు వచ్చిన వాటిని, అనంతరం కొంతమేర వచ్చిన వాటిని గుర్తించాలని తెలిపారు. ముందుగా పూర్తిగా వచ్చిన జవాబులను రాయాలని సూచించారు. అనంతరం మిగితా వాటిపై దృష్టి సారించాలన్నారు. పరీక్షలు జరిగినన్ని రోజులు టీవీ, సెల్‌ఫోన్‌లకు దూరంగా ఉండాలన్నారు.

దోమలో

దోమ: పదో తరగతి విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి లోను కాకుండా ప్రశాంతగా పరీక్షలు రాయాలని వైస్ ఎంపీపీ మల్లేషం సూచించారు. దోమ మండల పరిధిలోని మోత్కుర్ జిల్లా పరిషత్ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు ఎంపీ రంజిత్ రెడ్డి పంపిణీ చేసిన పరీక్ష ప్యాడ్స్ అందజేసి మాట్లాడారు. ఫైనల్ పరీక్షలు దగ్గర పడుతున్న నేపథ్యంలో విద్యార్థులు చదువుపై దృష్టి సారించాలన్నారు.



మర్పల్లి: వీడ్కోలు సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌ఐ అరుణ్‌కుమార్ గౌడ్

ఆందోళన చెందవద్దు..

మర్పల్లి: పరీక్షల సమయంలో విద్యార్థులు ఆందోళనకు గురికాకుండా ఎగ్జామ్ రాస్తే 100 శాతం ఉత్తీర్ణత సాధించవచ్చని మర్పల్లి ఎస్‌ఐ అరుణ్‌కుమార్ గౌడ్ తెలిపారు. మండల కేంద్రంలోని ఎస్సీ బాలికల వసతి గృహంలో పదో తరగతి చదువుతున్న విద్యార్థినులకు తోటి విద్యార్థినులు వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేయగా.. కార్యక్రమంలో ఎస్‌ఐ పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు ఈ పరీక్షలు తొలి మెట్టుగా భావించాలన్నారు. కార్యక్రమంలో వసతి గృహం వార్డెన్ తుల్జారామ్, సిరిపురం బీసీ హాస్టల్ మెట్రిన్ (వార్డెన్) సుమలత, విద్యార్థినులు పాల్గొన్నారు.

కొండాయపల్లిలో మద్యపాన నిషేధం

- గ్రామస్తుల ఏకగ్రీవ తీర్మానం
- ఉల్లంఘిస్తే రూ.10 వేలు జరిమానా: సర్పంచ్ కిష్టమ్మ

దోమ: మద్యం విక్రయాలు నిషేధిస్తూ కొండాయపల్లి గ్రామస్తులు ఏకగ్రీవంగా తీర్మానించారు. మంగళవారం జీపీ కార్యాలయంలో సర్పంచ్ అధ్యక్షతన వార్డు సభ్యులు, గ్రామస్తుల సమక్షంలో నిర్వహించిన గ్రామ సభలో నేటి (మంగళవారం)నుంచి మద్యం అమ్మకాలు నిషేధించినట్లు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ కిష్టమ్మ మాట్లాడుతూ.. గ్రామంలో సంపూర్ణ మద్యపాన నిషేధం అమలుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని, ఎవరైనా మద్యం విక్రయిస్తే రూ.10 వేల జరిమానాతో పాటు దుకాణ లైసెన్సును రద్దు చేస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా వ్యాపారులకు నోటీసులు అందజేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ కావలి మాణెమ్మ, పంచాయతీ కార్యదర్శి ప్రభాకర్ గౌడ్, వార్డు సభ్యులు నిర్మల, నందు, గ్రామస్తులు అనంతయ్య గౌడ్, కావలి రాములు, జనచైతన్య యువజన సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



మద్యం వ్యాపారులకు నోటీసులు అందజేస్తున్న సర్పంచ్ కిష్టమ్మ